


# భాగవత సారం

తాతయ్యగారూ అమ్మమ్మా మళ్ళీ వాదన వేసుకున్నారు. "నా ఆరోగ్యం బాగుండడం లేదు. పెందలాడే భోజనం చెయ్యమంటాడు హోమియో డాక్టరు. చెప్పినా చెవికెక్కదు నీకు" అంటాడు తాతయ్య.

"నేను ఊరికే కూర్చుంటున్నానా? లేచిన దగ్గరినించీ పరుగులు పెడుతూనే ఉన్నాను. పని తెమిలితేగా" అంటుంది అమ్మమ్మ.

"ఎలా తెముల్తుంది. శుచీ శుభ్రం అంటూ చీపుళ్ళు కడిగీ, ఇల్లు తుడిచే గుడ్డలు ఉతికీ, చాంతాళ్ళు కడిగీ సూర్యుడు నడినెత్తికెక్కితేగానీ పొయ్యి వెలిగించవు... నాంచారమ్మ వంట నక్షత్ర దర్శనం అన్నట్లు ఏ మూడింటికో పెడతావు పిండాకూడు" విసుక్కున్నారు.

"ఇదంతా నా కోసమా? నా జీవితం అంతా చాకిరీకే అంకితం అయిపోతోంది. ఆ గోడకెక్కి కూర్చున్న దేవుళ్ళందరికీ పూజ చెయ్యాలా? మహా నైవేద్యం పెట్టాలా? మీరు చూడబోతే గంట వినగానే వచ్చి పీటమీద కూర్చుంటారు. ఇటు మీకు వడ్డించి దేవుడికి

తాంబూలం ...కూర వడ్డించి మంత్రపుష్పం... నా శాయశక్తులా పరుగులు పెడుతూనే ఉంటాను. ఇంతకన్నా చెయ్యడం నా చాతకాదు బాబూ!" అంటుంది గద్గద కంఠంతో.

"కాస్త చాదస్తం తగ్గించుకో. హైరానా పడకుండా పెందలాడే పనులు తెముల్చుకో" అని అందరూ చెప్తారు అమ్మమ్మతో. అయినా ఆవిడ గొడవ ఆవిడదే.

ఒక పాత గుడ్డ తీసుకుని కిటికీ తుడవటం ప్రారంభిస్తుంది. పనిచేసే సమయంలో భక్తిపాటలు పాడుకోవటం ఆవిడకి అలవాటు.

"ఇక్ష్వాకుల తిలకా ఇకనైనా పలుకవా రామచంద్రా' అంటూ కిటికీ తుడుచుకుంటూ తాదాత్మ్యం చెందుతుంది. 'ఏ తీరుగ నను దయచూచెదవో' అంటూ పాడుతూ ఉంటే అడ్డువస్తారు తాతయ్య.

"నువ్వుకాదు ఆ పాట పాడుకోవల్సింది నేను. పన్నెండు రామదాసు కీర్తనలు అయిపోయినా మొదటి కిటికీ దగ్గరే ఉన్నావు. ఈ లెక్కన ఇరవై రెండు కిటికీలూ, పదిహేను ద్వారబంధాలూ తుడిచేది ఎప్పుడు, మడికట్టుకునేది ఎప్పుడు? వంటచేసి నాకింత ముద్దపెట్టేది ఎప్పుడు?"

"ఇదిగో అయిపోయింది" అంది అమ్మమ్మ.

"ఇట్లాకాదుగానీ నా మాటవిని ఒక్కో కిటికీకి ఒక్కో కీర్తన అని నియమం పెట్టుకో. కిటికీలకు రామదాసు కీర్తనలూ, తలుపులకు త్యాగరాజ స్వామి కీర్తనలూ అని అనుకో. సింహద్వారానికి కావాలంటే ఓ పంచరత్న కీర్తన పాడుకో. ఇట్లా నియమానుసారంగా నడుచుకుంటే నీకూ సుఖం నాకూ సుఖం" అంటూ సలహా చెప్పారు.

"బాగానేఉంది సంబడం. పాట అయిపోయినా ఇంకా దుమ్మూ ధూళీ మిగిలిపోతేనో. అయినా పని పనే- పాట పాటే. రెండింటికీ లంకె కుదరదు" అని చెప్పేసింది.

"నీ మతం నీదే, చెప్తే అర్థంకాదు. నీ శుభ్రతకు తట్టుకోలేక ఏదోనాడు నేను హరీ మంటాను. అప్పుడుగానీ నీ తిక్క కుదరదు" అంటారు తాతయ్య.

"ఏవిటా అపభ్రంశం మాటలు? నేనేదో మిమ్మల్ని మాడ్చిపారేస్తున్నట్లు హైరానాపడిపోతారు. అర్ధశేరు పాలు కాచి చిక్కటి కాఫీ ఇస్తే కంచుగిన్నె నిండా తాగుతారు. చాలదా? ఎంత సేపూ తిండిగొడవే మీకు. 'పొద్దుపొడిచే నమ్మ నారాయణా!

పొట్టలకు వేళాయె నారాయణా' అని శుచీ శుభ్రం వదిలేసి నేనుండలేనమ్మా" అంటుంది అమ్మమ్మ.

చెప్పీచెప్పీ విసుగేసి ఊరుకున్నారు అందరూ.

గుళ్ళో భాగవతం చెప్పడానికి వచ్చాడు ఒక పండితుడు. స్వయంపాకం ఏర్పాటు చేశారు. భాగవతి సప్తాహం మొదలయింది.

మొదటిరోజున – పురుషుడు ముక్తి పొందాలంటే యజ్ఞయాగాదులు చెయ్యాలి. తపస్సులు చెయ్యాలి. కానీ స్త్రీ ముక్తి పొందాలంటే పతిసేవ చేస్తే చాలు–అని చెప్పారుట.

తాతగారికి ఆశ కలిగిందిట.

"అయ్యా! రేపు మా వాళ్ళని తీసుకొస్తాను. ఈ ముక్క మళ్ళీ చెప్తే నాకు మేలు చేసినవారవుతారు" అన్నారుట ఆయనతో.

పిన్నిగారు మిమ్మల్ని సరిగ్గా చూడరా బాబాయిగారూ?" అని అడిగాడుట ఆయన.

"బాగానే చూస్తుంది. కాకపోతే వేళకి అన్నం పెట్టకుండా డొక్క మాడ్చేస్తుంది" చెప్పారుట ఆయన.

"సరే తీసుకురండి. ఈ పతిభక్తి గురించే మరింత మనసుకి హత్తుకుపోయేలా చెప్తాను" హామీ ఇచ్చారు ఆయన.

అమ్మమ్మని రమ్మంటే 'ఇదుగో మాధవా అదుగో మాధవా' అంటూ రోజులు గడిపేసింది.

ఒకరోజు పని తెములుచుకు వెళ్ళింది గానీ అప్పటికే పండితులవారు కథ ముగించి స్వస్తిఃప్రజాభ్యాం అనేస్తున్నారుట.

ఇక మిగిలింది ఒకేరోజు. తాతగారు గట్టి పట్టుదలతో నయానా భయానా చెప్పి వెంటబెట్టుకు వెళ్ళారు. ఆఖరి రోజు కాబట్టి చాలామంది వచ్చారు.

తాతగారు భార్యాసమేతంగా రావడం చూసి సందర్భంకాకపోయినా పతిభక్తి గురించి చెప్పారుట. ఆయన చెప్పినది వింటే చండికకూడా పతివ్రతగా మారిపోవాల్సిందేనుట.

మంగళహారతీ, చదివింపులూ అయ్యాక ఇంటికొచ్చాక "ఎలా ఉంది భాగవతం?" అని అడిగారుట.

"భేషుగ్గా ఉంది. మంచి పాండిత్యం, కంచు కంఠం. జన్మ చరితార్థం" అందిట అమ్మమ్మ.

"పతిభక్తి గురించి ఎంత బాగా చెప్పాడో విన్నావా?"

"పతిభక్తి గురించా? ఎప్పుడు చెప్పాడు?"

గతుక్కుమన్నారు తాతయ్య. "అదేమిటీ అంతసేపు చెప్తేనూ!"

"ఏమో మరి. ఎప్పుడు చెప్పేడు? అన్నట్లు మరిచాను. శ్రీదేవమ్మ నిన్న రాంభట్ల పాలెం నుంచి వచ్చింది. కూతురు నీళ్ళోసుకుంది కదా! నీరసంగా ఉందిట" చెప్తుంటే-

తాతయ్యకి చిరాకేసింది. "అందుకే నాకొళ్ళుమండేది. భాగవతం వినమని తీసికెళ్తే పక్కవాళ్ళతో కబుర్లు వేసుకుని పతిభక్తి కాస్తా గాలికొదిలేస్తివి" విసుక్కున్నారు.

తెల్లారింది. తోటలో పూలన్నీ కోసి పెద్ద గంగాళం నిండా నీళ్ళు తోడి దాన్లో ఈ పూలువేసి కడిగి బుట్టకి వడేస్తోంది అమ్మమ్మ.

"ఇదేమిటీ, ఈ పూల పరిశుభ్రతా కార్యక్రమం ఇదివరకు లేదే?" ఆశ్చర్యంగా అడిగారు తాతయ్య.

"భలేవారు మీరు. నిన్న భాగవతంలో చెప్పేరు వినలేదా? పువ్వులని క్రిమికీట కాదులూ, పక్షులూ ఎంగిలి చేస్తాయి. వాటిని శుభ్రపరిచి ఆ తరువాతే దేవుడి పూజకి వినియోగించాలి అని స్పష్టంగా చెప్పారు" సమాధానం చెప్పిందావిడ.

ఠపీమని నెత్తి బాదుకున్నారు తాతయ్య.

"శ్రీరామచంద్రా! అంత భాగవతంలో నువ్వు గ్రహించింది ఇదటే. ఇకనించి ఇంకో గంట ఆలస్యంగా నాకు తిండి పెడతావు. కోరి కష్టాలు కొని తెచ్చుకున్నట్లు అయింది" అనుకున్నారు నీరసంగా.

"బలవంతాన భాగవతం వినడానికి తీసికెళ్ళడమూ మంచిదే అయింది. ఎన్నో తెలియని విషయాలు తెలిశాయి" అంది అమ్మమ్మ ఎందుకైనా మంచిదని మరోసారి పూలు కడుగుతూ.

* * *